
క్లుప్తంగా

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. గురువారం నుంచి జరగనున్న ఉత్సవాలకు మండలంలోని చిట్టేల వెంకటేశ్వరస్వామి, మక్కపేట అయ్యప్పస్వామి, ఆంజనేయ స్వామి, అల్లిలి సారంగమఠాలతోపాటు వత్సవాయిలోని వత్సవాయమ్మతలి, రామాలయం , దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, మంగొల్లు, భీమవరం గ్రామాల్లో ప్రధాన సెంటర్లు, దేవాలయాల వద్ద కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులు పాటు ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో చేయనున్నారు. అమ్మవారి విగ్రహాలు ఏర్పాటుచేసేందుకు మండపాలను అందంగా తయారుచేస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు చూసుకోవాలని ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకలు



కొణకంచి(పెనుగంచిప్రోలు): స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకలు నిర్వహించారు. ముందుగా గాంధీజీ జయంతి సంతర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, గ్రామ కార్యదర్శి శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో ఈ నెల మూడు నుంచి ఎనిమిది వరకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు బుధవారం తెలిపారు. 3న అన్నవరం, తక్కెళ్లపాడు, 4న పోచంపల్లి, గౌరవరం, వేదాద్రి, బూదవాడ, 6న బండిపాలెం, జయంతిపురం, అనుమంచిపల్లి, 7న చిల్లకల్లు, గండ్రాయి, మల్కాపురం, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట, ఎనిమిదిన బలుసుపాడు, ధర్మవరప్పాడుతండ, కెఅగ్రహారం, ముక్త్యాల, తిరుమలగిరి గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. 9న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్ హియరింగ్ జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులు పర్యటిస్తున్నారని తెలిపారు.

ఆర్థిక బాధలు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

జగ్గయ్యపేట: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పద్మావతి నగర్ కాలనీకి చెందిన ఏకసిరి వెంకటేశ్వరమ్మ భర్త లేకపోవటంతో కుమార్తెతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులుండటంతో పాటు ఇటీవల వచ్చిన పాలేటి వరదకు గృహంలోని సామగ్రి పాడవటంతో మనస్థాపంతో సాయంత్రం సమయంలో ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన చుట్టు పక్కల వారు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు. స్థానిక పోలీసులు ఆమె వివరాలు సేకరించారు.

42 మద్యం సీసాలు పట్టివేత

కంచికచర్ల: అక్రమంగా మద్యం విక్రయించినా తరలించినా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ సీఐ అఫ్షఫన్నీసా బేగం హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం నుంచి బైక్‌పై అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ, కంచికచర్లకు చెందిన మంగిశెట్టి రాజేష్ ఎర్రుపాలెం నుంచి బైక్‌పై 42 మద్యం సీసాలు తరలిస్తుండగా కంచికచర్లకు రాగానే పట్టుకున్నామన్నారు. పట్టుకున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: బహుజన సమాజ్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ పాల్గొన్నారు. ఈ నెల 9 న బీసీ కుల జన గణన కోరుతూ బహుజన సమాజ్ పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గాంధీజీ ఆశయాలు అందరికీ మార్గదర్శకం



నందిగామలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



పేటలోని బంగారు కొట్ల సెంటలర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య



పేట మున్సిపల్ పార్క్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సామినేని ఉదయభాను



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ వద్ద గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగరాజు, ఉద్యోగులు



జగ్గయ్యపేటలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుగంచిప్రోలు: మహాత్మా గాంధీజీ ఆశయాలు అందరికీ మార్గదర్శకం కావాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ గాంధీజీ ఆశయాలను నెరవేరుస్తుందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కె.శ్యామ్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అనిగండ్లపాడు గ్రామంలో సర్పంచ్ బి. జ్యోతిబ్రహ్మం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పిడికిటి కోటేశ్వరరావు, కొత్తపల్లి పెంటయ్య, వూట్ల లక్ష్మయ్య, ఉన్నం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. గుమ్మడిదుర్రు గ్రామంలో గాంధీజీ జయంతి వేడుకల్లో సర్పంచ్ నక్కా కమల, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్, పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: ఆయుధాలతో హింసా మార్గంలో సాధించలేనిది, శాంతియుతంగా, అహింసా మార్గం ద్వారా సాధించవచ్చని ఆచరణలో నిరూపించిన మహాత్మా గాంధీజీ యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాత అని, ఆయన ఆశయ సాధనలో ముందుకు సాగుదామని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. గాంధీ జయంతి, భారత రెండవ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి, మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ పఠాన్ ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థాన డైరెక్టర్ నంబూరి రవి తదితర నేతలు పూలమాలతో సత్కరించి నివాళులర్పించారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం అహర్నిషలు కృషిచేయడం ద్వారా గాంధీజీ ఆశయాలను అక్షరాల నిజం చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావి తరాలకు స్ఫూర్తివంతంగా నిలిచారని తెలిపారు. అలాగే లాల్‌బహదూర్‌శాస్త్రి సేవలను కొనియాడారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి లాహోరి బద్దూనాయక్, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్, పట్టణ మాజీ అధ్యక్షుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు చొడవరపు జగదీష్, న్యాయవాది సత్యశ్రీనివాస్, మంగళిబజారు రుక్యా మసీదు ఇమాం కమర్, నాయకులు మెట్టు ఏడుకొండలు, వేముల విజయ్‌కుమార్, షేక్ ఖాదర్, పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, తక్కెళ్లపాడు నాయకులు బైరబోయిన బాబు, జి.శంకర్, ఎం.ఐజయ్య , ఆనందపాల్ పాల్గొన్నారు.

కంచికచర్ల: జాతిపిత మహాత్మాగాంధీజి జయంతి వేడుకలు స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం రావడానికి గాంధీజీ ఎంతగానో కృషి చేశాడని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. పరిటాల, కంచికచర్ల, మోగులూరు, గొట్టుముక్కల ఎస్. అమరవరం, గండేపల్లి గ్రామాల్లో గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు. పెద్దబజార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహాత్ముడి విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సంఘ నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు జూలూరి విశ్వనాథం, వేములపల్లి వెంకటరత్నం, రవికిషోర్, ప్రసాద్, శ్రీనివాసరావు, కొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ బాటలో నడవాలి

వత్సవాయి: పూజ్య బాపూజీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి పలువురు వక్తలు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి శ్రీనివాస్ గాంధీ సెంటర్‌లో ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మక్కపేటలో కన్నెవీడులో సర్పంచ్ చావా దుర్గారాణి, మంగొల్లులో అన్నెపాక ప్రణీత, భీమవరంలో సర్పంచ్ కారుపాటి మాధురి ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వత్సవాయి సర్పంచ్ భూక్యా సీతమ్మ, పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్, పెద్ది రామారావు, మాదాల వీరయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: మహాత్మాగాంధీ జయంతి పట్టణంలో బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, కార్యాలయాలు, కూడళ్లలోని మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బంగారుకొట్ల సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి ఉదయభానుతో పాటు పలువురు జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మైన్స్ టౌన్‌షిప్ సీడబ్ల్యుసీ లో మహాత్మా గాంధీ చిత్రపటానికి జెఎల్ఎం మైన్స్ ఇన్‌చార్జ్ నాగరాజు, స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు చంద్రశేఖర్, జేవీఎస్‌డీ ప్రసాద్, రామచంద్ర నాయక్, వలిబాబు,హేమనాయక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

జుజ్జూరు(వీరులపాడు): మండలంలోని జుజ్జూరు గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజకిషోర్ మహాత్ముని చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రమావత్ కోటి బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ పారిశుద్ధ్య సిబ్బందిని ఆమె సత్కరించారు. వార్డు సభ్యులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన బాపూజీ..

నందిగామ టౌన్: మహాత్మా గాంధీజీ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టారని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ, శాస్త్రి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ సహాయ నిరాకరణ, సత్యాగ్రహం అనే ఆయుధాలతో సత్యం, అహింస మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మీ, వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఎంపీపీ ఆకుల హనుమంతరావు, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, సూరె రామారావు, బండారు వెంకట్రావ్, యాకుబ్ అలీ, మన్నెం దాసు, వడ్డెల్లి శ్రీనివాసరావు, ఓర్సు జ్వాలా, గుంటుపల్లి రామకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్ముని, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్ముడు నడిచిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అన్నారు.



పెనుగంచిప్రోలు సచివాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ పద్మ



పెద్దబజార్ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

పేటలో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం



పెద్ద రామాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాలు పట్టణంలో బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా స్థానిక పెద్ద రామాలయంలో జరిగిన వేడుకల్లో రంగు రంగుల వివిధ రకల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ నృత్యాలు, కోలాటాలతో అలరించారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.

10 వ తేదీ వరకు బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 2 వ తేదీ నుంచి మొదలైన బతుకమ్మ ఉత్సవాలు 10 వ తేదీ వరకు పట్టణంలోని పలు దేవాలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు బతుకమ్మ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు అనంతరాజ, తులసి సుబ్బారావు బుధవారం తెలిపారు. 2 వ తేదీ బుధవారం పెద్ద రామాలయం, 3 న శ్రీవరదరాజస్వామి ఆలయం, 4 న శ్రీముత్యాలమ్మ ఆలయం, 5 న పెద్ద శివాలయం, 6 న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, 7 న న కాశిబజారులోని శ్రీకనకదుర్గ ఆలయం, 8 న శ్రీ చెన్నకే శవ ఆలయం, 9 న శ్రీరంగనాయకస్వామి ఆలయం, 10 వ తేదీన చెరువు బజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో జరుగు ఉత్సవాలతో ముగుస్తాయన్నారు. ప్రతిరోజు ఆయా దేవాలయాల్లో సాయంత్రం 5 గంటల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తారని, ఈ వేడుకల్లో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, కోశాధికారి యర్రా శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు చెక్కా సుధాకరరావు, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి



నందిగామ టౌన్: ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశం స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్ర పటానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

కార్మికుల సేవలు వెల కట్టలేనివి

నందిగామ టౌన్: పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని చిత్ర పటానికి బుధవారం ఆయన పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్నారన్నారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను వివరించి మున్సిపల్ కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మీ, కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు యాప్రాన్లు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ అభివృద్ధిలో కోహెన్స్ లైఫ్ సైన్సెస్ (రాకెమ్ ఫార్మా) కంపెనీ వారి భాగస్వామ్యం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోహెన్స్ లైఫ్ సైన్సెస్ వారి వితరణతో సుమారు రూ.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు యాప్రాన్లు (చొక్కాలు), కళ్లజోళ్లు, గమ్ బూట్లు, చేతి గ్లోవ్స్ ఎమ్మెల్యే తాతయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కరోనా కష్టకాలంలో, ఇటీవల వరదల సమయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు అమోఘమన్నారు. కార్మికులకు యాప్రాన్‌లు, బూట్లు, కళ్లజోళ్ల తదితరాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్.రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, మున్సిపల్ కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వరరావు, గొట్టె నాగరాజు, బుజ్జిబాబు, వెంకట్రామయ్య, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోనరావు, టీడీపీ నాయకులు, కోహెన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




కార్మికులకు యాప్రాన్లు, గమ్ బూట్లు తదితరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

సామాజిక సేవ, శాంతి,ధర్మం అనుసరించాలి..


గాంధీజీ ఆచరించి చూపిన సామాజిక సేవ, శాంతి, ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఎమ్మెల్యే తాతయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ చిత్రపటానికి ఎమ్మెల్యే తాతయ్య నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తాతయ్య ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మొక్కలను నాటారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బందితో కలిసి బస్టాండ్ ప్రాంగణాన్ని చీపుర్లతో శుభ్రం చేశారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని, పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని తెలియజేసినట్లు తెలిపారు.

ఐదు గంటలసేపు విద్యుత్ నిలిపివేత



జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి బుధవారం సాయంత్రం సుమారు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనకు కారణం ఓ కోతి. వినడానికి విచిత్రంగా ఉన్నా నమ్మాల్సిందే. బుధవారం సాయంత్రం ఒక కోతి చిల్లకల్లు సబ్ స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభంపైకి ఎక్కింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు బ్రేక్ డౌన్ చేశారు. ఫలితంగా జగ్గయ్యపేట పట్టణంతో పాటు పలు గ్రామాలకు బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. రాత్రి 9.30 వరకు కరెంటు రాలేదు. కోతి కరుణించి లైన్ మీద నుంచి క్రిందకు దిగి వచ్చే వరకు కరెంట్ సరఫరా చేయలేమని ఏడీఈ శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

జగ్గయ్యపేట: కర్మాగారాలు గ్రామాల అభివృద్ధికి తమ వంతుగా సహకరించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని ముక్త్యాల గ్రామంలోని కోహెన్స్ లైఫ్ సైన్స్ సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కళ్లజోళ్లు, యూనిఫాం, గ్లౌజ్‌లతో కూడిన కిట్‌లను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు చేసే శ్రమ వెలకట్టలేనిదన్నారు. వారిని ఆదరించాలని తెలిపారు. కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఏసీఎస్ఆర్ నిధులతో అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, కమిషనర్ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హుసేన్ బాధ్యతల స్వీకారం

వీరులపాడు: మండల తహసీల్దార్‌గా షేక్ హుసేన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేసిన రాజకిషోర్ సాధారణ బదిలీల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా ఉండి భీమవరం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బదిలీపై ఇక్కడకు వచ్చిన హుసేన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందన్నారు.

నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): దసరా పండుగ సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వర స్వామి ఈ నెల మూడు నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సురేష్‌బాబు బుధవారం తెలిపారు. తొలి రోజు బాలత్రిపురసుందరీ దేవిగా, నాలుగున గాయత్రి దేవి, ఐదున అన్నపూర్ణాదేవి, ఆరున లలితాత్రిపుర సుందరీ దేవి, ఏడున భువనేశ్వరీ దేవి, ఎనిమిదిన మహాలక్ష్మీ, తొమ్మిదిన సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరీ దేవిగా అలంకరిస్తామని తెలిపారు. అదే విధంగా ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు రాత్రి ఏడు గంటలకు సహస్ర కుంకుమ పూజ చేస్తామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. విద్యుదీకరణతో పాటు శరన్నవరాత్రి ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తిరుమలగిరి గ్రామంలోని కొండపై ఉన్న శివాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఈవో వరప్రసాద్ తెలిపారు.

నందిగామ టౌన్: విజయదశమి పండుగ సందర్భంగా పట్టణం, మండలంలోని ఆయా గ్రామాలలోని ఆలయాలు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖాధికారులు, ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఈవో హరిగోపీనాద్ తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల మూడున అమ్మవారు రజతకవచాలంకారం, నాలుగున బాలాత్రిపుర సుందరీ, ఐదున గాయత్రి దేవి, ఆరున అన్నపూర్ణాదేవి, ఏడున లలితాత్రిపుర సుందరీ దేవి, ఎనిమిదిన మహాలక్ష్మీ దేవి, తొమ్మిదిన మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవిగా, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిస్తారని చెప్పారు. ప్రతిరోజు ఆలయంలో సుప్రభాత సేవ, వేద పారాయణ, చండీ సమిత రుద్రహోమం, ఖడ్గమాలార్చన, విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా పట్టణంలోని మరిడీ మహాలక్ష్మీ, వాసవీ కన్యకా పరమేశ్వరీ, వుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి వారి ఆలయాలతో పాటు పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో ముక్తేశ్వర స్వామి వారి ఆలయం

అక్రమంగా మట్టి తరలింపు

కంచికచర్ల: తెలుగు తమ్ముళ్లకు వరంగా మారిన ఇసుక, మట్టి. టీడీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి టీడీపీ శ్రేణులు అక్రమార్జనకు తెరలేపారు. సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పథకం పెట్టి ప్రజలకు అందుబాటులో ఇసుక లభ్యమవుతుందని గొప్పలు చెప్పుకున్నారు. కాని ఆచరణలో మాత్రం సాధ్యం కావటంలేదు. ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు మాత్రం ఇసుక, మట్టి దొరకటంలేదు. మండలంలోని గండేపల్లిలో అధికార పార్టీ నాయకులు మాత్రం ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండా బుధవారం ఇష్టారాజ్యంగా మట్టిని తరలించి అక్రమార్జనకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డూ అదుపులేకుండా అక్రమంగా మట్టిని తరలించినా అధికారులు మాత్రం మిన్నకుండిపోతున్నారు. అదేమంటే అధికారులకు తాము ముడుపులు చెల్లిస్తున్నామని తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని తమను ఎవ్వరూ ఆపలేరని యథేచ్ఛగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడుతున్నాందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్నపాటి సంఘటన జరిగితే రోడ్డుకు ఈడ్చే పోలీస్, రెవెన్యూ అధికారులు మాత్రం తమకు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

